నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 5 ఏప్రిల్ 2024 | HYDERABAD



సమావేశంలో మాటాడుతున్న సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి


## 50 ఏండ్లలో జరుగని అభివృద్ధి పదేండ్లలోనే..

### సికింద్రాబాద్‌పై గులాబీ జెండా ఎగురవేస్తాం

### బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, ఏప్రిల్ 4: సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానంపై గులాబీ జెండా ఎగురవేస్తామని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు మద్దతుగా అడ్డగుట్ట, సీతాఫల్‌మండి, తార్నాక, మెట్టుగూడ, బౌద్ధనగర్ తదితర డివిజన్‌లకు చెందిన సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో సీతాఫల్‌మండి డివిజన్ టీఆర్‌టీ క్వార్టర్స్ సమీపంలో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ...'సికింద్రాబాద్‌లో 50 ఏండ్లలో జరుగని అభివృద్ధిని....కేవలం పదేండ్లలోనే చేసి చూపించాం. నియోజకవర్గ ప్రజలకు అన్ని వేళ్లలో అందుబాటులో ఉన్నాం. వారి కష్ట సుఖాల్లో పాలు పంచుకున్నాం' అని అన్నారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేసి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు హేమ , ప్రసన్న లక్ష్మి , శైలజ , యువజన విభాగం నాయకులు రామేశ్వర్ గౌడ్ , కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం.. గెలుపే లక్ష్యం



మేడ్చల్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకునేలా బీఆర్ఎస్ నిర్వహిస్తున్న వరుస సమావేశాలు.. ఆపార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నాయి. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో సమావేశాలను నిర్వహిస్తూ.. గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలను సమయత్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న సమావేశాలకు భారీ ఎత్తున ప్రజలు, శ్రేణులు హాజరై విజయవంతం చేస్తున్నారు. స్వచ్ఛందంగా తరలివస్తున్న కార్యకర్తలు, ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంపై గులాబీ జెండా ఎగురవేసేందుకు ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా క్షేత్రస్థాయిలో శ్రేణులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు పథకాలను అమలు చేస్తామని చెప్పి.. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమావేశాల్లో బీఆర్ఎస్ నేతలు శ్రేణులకు సూచిస్తున్నారు. రైతుల రుణ మాఫీ చేయకపోవడం, క్వింటాలుకు రూ. 500 బోనస్‌పై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడం వంటి విషయాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లేలా దిశానిర్దేశం చేస్తున్నారు.



# జంక్షన్లు జామ్!

### నత్తనడకన అభివృద్ధి పనులు.. కూడళ్లలో చుక్కలు చూపిస్తున్న ట్రాఫిక్

సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీ నివారణలో భాగంగా పలు చోట్ల జీహెచ్ఎంసీ చేపడుతున్న జంక్షన్ల అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. గడిచిన ఐదు నెలలుగా మూడు అడుగులు ముందుకు-ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా పనులు జరుగుతున్నాయి. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్ల బిల్లుల చెల్లింపులు లేక కాంట్రాక్టర్లు పనులు చేపట్టలేక మధ్యలోనే చేతులెత్తేస్తున్న పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ఎనిమిది ప్రాంతాల్లోని కూడళ్లలో ట్రాఫిక్ జామ్‌లు అవుతున్నాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో పరిస్థితి మరింత ఘోరంగా ఉంటున్నది. నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తుండటంతో ఎండాకాలం నడిరోడ్డుపై జనం నరకం చూస్తున్నారు. దీనికి తోడు వీఐపీలు వచ్చి వెళ్లే సమయాల్లో మాత్రమే కనిపించే ట్రాఫిక్ సీఐలు, ఎస్ఐలు..వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో ఉండటం లేదు. జీహెచ్ఎంసీ కమిషనర్ చొరవ తీసుకుని జంక్షన్ల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### నెమ్మదిగా జరుగుతున్న జంక్షన్ల అభివృద్ధి పనుల వివరాలివి

| జంక్షన్ | ఖర్చు చేస్తున్నది (రూ.లక్షల్లో) | పనుల పురోగతి(శాతంలో) |
|---|---|---|
| హబ్సిగూడ | 202 | 70 |
| కొత్తపేట | 305.50 | 85 |
| ఆరంఘర్ చౌరస్తా | 263.50 | ప్రారంభ దశలో.. |
| ఐఎస్ సదన్ | 320 | ప్రతిపాదన దశ దాటలేదు |
| పంజాగుట్ట | 198 | 40 |
| ఎన్ఎఫ్‌సీఎల్ | 200 | ప్రారంభ దశలో.. |
| నారాయణగూడ | 199 | 75 |
| సంగీత్ | 198.8 | 90 |

## కాంగ్రెస్ పాలనలో తాగునీటి ఇబ్బందులు

### కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

బాలానగర్ , ఏప్రిల్ 4 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలని, మల్కాజిగిరి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం ఫతేనగర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో తాగునీటి ఇబ్బందులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ప్రజలకు ఆరు గ్యారెంటీల ఆశ చూపి..అధికారంలోకి కాంగ్రెస్ వచ్చిందన్నారు. ఎన్ని గ్యారెంటీలు అమలు చేసిందో వివరణ ఇవ్వాలన్నారు. రాగిడి మాట్లాడుతూ మల్కాజిగిరి స్థానం నుంచి తనను ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్, సీనియర్ నేతలు కుతాడి రాములు, డివిజన్ అధ్యక్షుడు భిక్షపతి పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి..

### మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 4: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలుపించాలని ఓటర్లకు మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ముఖ్యనాయకులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఓటర్ల వద్దకు వెళ్లాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు చామకూర భద్రారెడ్డి, ఘట్‌కేసర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ మాధవ రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## గరం గరంగా.. నగరం..

సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): నగరంలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. దక్షిణ దిశ నుంచి వీస్తున్న కిందిస్థాయి గాలుల ప్రభావంతో నగరంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని మించి నమోదవుతున్నాయి. ఫలితంగా ఉదయం 8 గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నం సమయానికి అగ్నిగుండాన్ని తలపిస్తున్నాయి. దీంతో ప్రజలు అత్యవసరముంటే తప్ప.. బయటకు రావడం లేదు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు సిటీలో గరిష్ఠం 40.3, కనిష్ఠం 26.4 డిగ్రీ సెల్సియస్, గాలిలో తేమ 21శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

## కష్టపడి పనిచేద్దాం.. గులాబీ జెండా ఎగురవేద్దాం

### ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



దుండిగల్, ఏప్రిల్ 4: బీఆర్ఎస్ పార్టీపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని, కష్టపడి పనిచేసి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరిపై బీఆర్ఎస్ జెండా ఎగురవేద్దామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హిల్‌కౌంటీ లో బీఆర్ఎస్ పార్టీ నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ ఆధ్వర్యంలో కార్పొరేషన్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులంతా ప్రణాళికాబద్ధంగా ఇంటింటికీ తిరుగుతూ ముమ్మరంగా ప్రచారం చేసి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ పాల్గొన్నారు.



## క్లాసిక్ మిసెస్ ఇండియాగా రత్నామెహ్రా

చక్కని అందంతో మైమరిపించింది హైదరాబాద్‌కు చెందిన రత్నామెహ్రా. ఇటీవల గుర్గావ్‌లో జరిగిన 'క్లాసిక్ మిసెస్ ఇండియా-2024' పోటీల్లో విజేతగా నిలిచింది. గురువారం మణికొండ ల్యాంకోహిల్స్‌లో ఆమెను ఘనంగా సత్కరించారు.

- సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ)

# మా పొట్ట కొట్టొద్దు!

- నిబంధనలకు విరుద్ధంగా ఇతర రాష్ట్రాల వాహనాల రాకపోకలు
- రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యంతో బతుకులు ఆగం
- ఫిర్యాదులు చేసినా.. చర్యలేవీ..?
- వాహన సంఘాల ఆగ్రహం

### కమీషన్ల కక్కుర్తితోనే అధికారులు పట్టించుకోవడం లేదంటూ విమర్శలు

### సక్రమంగా తనిఖీలు చేస్తే ప్రభుత్వానికి భారీ ఆదాయం

### నగరంలో 80 వేల మంది క్యాబ్ డ్రైవర్స్

### కాంగ్రెస్ సర్కారు తీరుపై కన్నెర్ర




సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సర్కార్‌పై డ్రైవర్లు కన్నెర్ర చేస్తున్నారు. ఉపాధిని సృష్టించాల్సింది పోయి ఉన్న ఉపాధిని నాశనం చేసి.. జీవితాలను ఆగం చేస్తున్నదని మండిపడుతున్నారు. ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు రోడ్డున పడాల్సిన దుస్థితి ఏర్పడింది. తాజాగా క్యాబ్ డ్రైవర్లు కూడా రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల వాహనాలు హైదరాబాద్‌లో రాకపోకలు సాగిస్తూ ఇక్కడి డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీస్తున్నాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఐటీ కంపెనీల్లో పనిచేసే కొందరు ఇతర రాష్ట్రాల వెండర్స్ వారి కంపెనీ కార్యకలాపాలకు సైతం తమ రాష్ట్రాలకు చెందిన వాహనాలను ఇక్కడికి నిబంధనలకు విరుద్ధంగా రప్పించి వినియోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ ప్రక్రియతో ఇక్కడి డ్రైవర్లకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని, ముఖ్యంగా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడుకు చెందిన సుమారు 7 వేల వాహనాలు అక్రమంగా నగరంలో తిరుగుతున్నాయని డ్రైవర్లు చెబుతున్నారు. ఈ అక్రమ వాహనాలపై ఇప్పటికే వాహన సంఘాల నాయకులు రవాణా శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. మామూళ్ల మత్తులో ఆ వాహనాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తెలంగాణ ఫోర్ వీలర్స్ అసోసియేషన్, ఆటో యూనియన్ నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా, నగరంలో సుమారు 80వేల మంది క్యాబ్ డ్రైవర్స్ ఉండగా.. ఇప్పుడు వారంతా తమ ఉపాధిపై ఆందోళన చెందుతున్నారు.

### ఖైరతాబాద్‌లోనే అధికం..

రవాణా శాఖ ప్రధాన కార్యాలయం ఖైరతాబాద్‌లోనే ఉంది. ఇక్కడ కమిషనర్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్స్, ఇద్దరు ఆర్టీవోలు ఉంటారు. ఈ పరిధిలోనే అక్రమ వాహనాలు వందల్లో తిరుగుతున్నా అక్కడి అధికారులు పట్టించుకోవడం లేదని ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య ఆరోపించారు. తనిఖీలు చేయడంలో ఆర్టీవోలు ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అధికారులు నామమాత్రపు తనిఖీలతోనే కాలయాపన చేస్తున్నారని వాపోతున్నారు. 7 రోజుల కాల పరిమితితో బార్డర్ ట్యాక్స్ పేరిట ఇతర రాష్ట్రాల వాహనాలు నగరంలోకి ప్రవేశించి ఇక్కడే తిష్టవేస్తున్నాయి. మరోవైపు ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి యాప్ ఆధారిత సేవల్లో కూడా ఇతర రాష్ట్రాల వాహనాలే నడుస్తున్నాయని డ్రైవర్లు చెబుతున్నారు. వాహనానికి సంబంధించి పన్నులు, ఇన్సూరెన్స్‌లు చెల్లించి ప్రభుత్వానికి రాబడి వచ్చేలా తాము చేస్తుంటే ఇతర రాష్ట్రాల వాహనాలను తనిఖీలు చేయకుండా తమ ఉపాధిని దెబ్బకొడుతున్నారని వాపోతున్నారు. బీహెచ్ఎల్ , ఆరంఘర్, సీబీఎస్ తదితర ప్రాంతాల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు తిరుగుతున్నాయని తెలిపారు.

### రాబడిని అడ్డుకుంటున్నారు..

రవాణా శాఖ అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తే ప్రభుత్వ ఖజానాకు భారీ ఆదాయం సమకూరుతుంది. ఇతర రాష్ట్రాల వాహనాలు ఇక్కడ నడవాలంటే అవి వారి సొంత రాష్ట్రాల్లో టీఆర్ రద్దు చేసుకుని ఇక్కడ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఈ పన్నును ఎగవేయడం కోసం వారు అడ్డదారులు తొక్కుతున్నారు. అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఈ సమస్య మరింత జఠిలమై డ్రైవర్ల పాలిట శాపంగా మారింది. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని నిర్లక్ష్యపు తనిఖీలతో రవాణా శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని విమర్శించారు. అంతేకాదు కొందరు ముఠాలుగా మారి కొందరు అధికారుల ప్రోత్సాహంతో యెల్లో ట్యాక్సీ ప్లేట్ అనుమతి లేకున్నా.. సొంత వాహనాలను ప్రయాణికుల రాకపోకలు వినియోగిస్తున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని డ్రైవర్లు వాపోతున్నారు.

### సుమారు 7వేల ఇతర రాష్ట్రాల వాహనాలు..

**-షేక్ సలావుద్దీన్, అధ్యక్షుడు, తెలంగాణ ఫోర్ వీలర్ అసోసియేషన్**



రవాణా శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సుమారు 7వేల ఇతర రాష్ట్రాల వాహనాలు ఇక్కడ నడుస్తున్నాయి. ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. తనిఖీలు జరిపి వాహనాలపై చర్యలు తీసుకుంటే ప్రభుత్వానికే ఆదాయం వస్తుంది. కానీ అధికారులు అలా చేయడం లేదు. ఇప్పటి వరకు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలను ఎన్ని సీజ్ చేశారు? పబ్లిక్ డొమైన్‌లో కూడా ఎలాంటి వివరాలు పెట్టడం లేదు. అధికారులు ఇప్పటికైనా మామూళ్ల మత్తులో నుంచి బయటకు రావాలి. ఈ అంశంపై వాహన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం. ప్రభుత్వం స్పందించి డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి.

### మాపై దాడులు చేస్తున్నారు

**-సంతోష్ కుమార్, క్యాబ్ డ్రైవర్**



రవాణా శాఖ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మన రాష్ట్రానికి చెందిన వాహనాలు ఇతర రాష్ట్రాలకు వెళితే అక్కడి ట్రాన్స్‌పోర్ట్ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారు. నంబర్ ప్లేట్ చూడగానే బండిని ఆపేసి ఆరా తీస్తారు. కానీ ఇక్కడ వేలాదిగా ఇతర రాష్ట్రాల వాహనాలు అక్రమంగా తిరుగుతున్నా.. పట్టించుకోవడం లేదు. అక్రమంగా ప్రయాణికులను తరలిస్తున్న నిర్వాహకులను అడ్డుకుంటే మాపైనే దాడులు చేస్తున్నారు. ఏ ఆర్టీవోకు చెప్పుకుంటావో చెప్పుకో పో అంటున్నారు. వాళ్లంతా తమ మనుషులేనని పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకొని మా డ్రైవర్ల ఉపాధిని కాపాడాలని కోరుకుంటున్నా.